క్లుప్తంగా

చికిత్స పొందుతూ విశ్రాంత ఏఆర్ ఎస్సై మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన విశ్రాంత ఏఆర్ ఎస్సై వాసంశెట్టి త్రిమూర్తులు(65) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిమూర్తులు స్వరూప్‌నగర్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం రాత్రి 7.30 గంటలకు ఆయన స్కూటీపై వెళుతుండగా శ్రీరామ్‌పురం ఫారెస్టు రోడ్డులో వాటర్ ట్యాంకు వద్దకు వచ్చేసరికి అతడిని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన త్రిమూర్తులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. త్రిమూర్తులు కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ సత్య దేవా నర్సరీని సందర్శించిన సుఖదేవ్ వల్లభ్



శ్రీసత్యదేవనర్సరీని సందర్శించిన సాదు సుఖదేవ్ వల్లభ్

కడియం: కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీ (పుల్లా వీర వెంకట్రావు) నర్సరీని శ్రీ స్వామినారాయణ్ అంతర్జాతీయ గురుకుల ఆశ్రమ పాఠశాల సాదు సుఖదేవ్ వల్లభ్ స్వామీజీ తమ శిష్య బృందంతో శనివారం సందర్శించారు. తమ మైసూర్ ఆశ్రమం మొక్కల పెంపకం నిమిత్తం గార్డెన్ తయారీ కోసం అవసరమైన మొక్కలను కొనుగోలు చేయాలని ఆలోచనతో శ్రీ సత్య దేవా నర్సరీని సందర్శించామని తెలిపారు. నర్సరీరైతు పుల్లా వీరవెంకట్రావు పలు మొక్కల విశిష్టతను వారికి వివరించారు. హైదరాబాద్ కు చెందిన శ్రీ చిలుకూరి బాలాజీ స్వామి టెంపుల్ పక్కన ఉన్న గురుకుల్ చైర్మన్ శ్రీకృష్ణ చరణ్ స్వామీజీ, మైసూర్ గురుకుల చైర్మన్ మంత్రదాస్ స్వామీజీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో కె రామ్ చంద్రమోహన్, ఎంఆర్ పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, గొల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనం



గాత్రకచేరిలో దేవులపల్లి గోపీకిషోర్ గానం చేస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ గాయకుడు దేవులపల్లి గోపి కిషోర్ గానం చేసిన అన్నమయ్య, శివ పదం కీర్తనలు శ్రోతలను అలరించాయి. స్థానిక టీ నగర్‌లోని త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 74వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన గోపికిషోర్ గాత్ర కచేరిలో తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారులు పాండురంగారావు తబల, కల్యాణ్ కుమార్ కీబోర్డ్, శంకర్ వయొలిన్ సహకారాలను అందించారు. నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. సమితి గౌరవాధ్యక్షుడు వాడ్రేవు వెంకట రమణ, చైర్మన్ చింత లూరి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జే. సరస్వతి, కార్య నిర్వాహక కార్యదర్శి వి.భాస్కర్ రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు హాజరయ్యారు.

త్వరలో అమరావతి నిర్మాణ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ: రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఈ నెల 15వ తేదీలోపు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో టెండర్లు తెరిచి, కాంట్రాక్ట్ సంస్థలను ఎంపిక ప్రక్రియ ప్రారంభించామన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీపై రెండు రోజుల్లో జీఓలు జారీ చేస్తామన్నారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం గోదావరి పుష్కరాలపై స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక ఇస్తామన్నారు. ఏప్రిల్ 1 నుంచి మున్సిపాలిటీల ఆదాయం వాటికే చెందేలా నిర్ణయించామన్నారు. మున్సిపాలిటీలు, రుడా పరిధిలో భవనాలు, లే అవుట్ అనుమతులు టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా త్వరితగతిన జారీ చేస్తున్నామని తెలిపారు. 15 మీటర్ల ఎత్తున ఐదంతస్తుల్లో నిర్మించే భవనాలకు ప్లాన్ స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ పాల్గొన్నారు.



సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్‌ను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు



కడియం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై,పీసీలను సత్కరించిన ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు



హుకుంపేటలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మహిళలను గౌరవించాలి

- నగరంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- పలు చోట్ల విభిన్న రంగాల్లోని మహిళలకు సత్కారం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో



నగర బీజేపీ మహిళా ఆధ్వర్యంలో బాలికలకు బహుమతుల ప్రదానం

సీటీఆర్ఐ: సృష్టికి మూలమైన మహిళలను పూజించాలని వక్తలు అన్నారు. ఆమె లేకుంటే కుటుంబ వ్యవస్థలేదని, కుటుంబాలు సక్రమంగా నడవడానికి వారే కారణమని అన్నారు. స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, అందుకే మహిళలను గౌరవించాలన్నారు.

స్థానిక లాలాచెరువు వద్దగల చేంజెస్ ప్రీవెంటేషన్ యూనిట్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేంజెస్ స్వచ్ఛంద సంస్థలో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వసుంధర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సాధికారత దిశగా ప్రయాణించాలన్నారు. డాక్టర్ వసుంధర, మానసను సత్కరించారు.

చెల్లుబోయిన మూర్తి ఆధ్వర్యంలో

అంబేద్కర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 13వ డివిజన్, తాడితోట అంబేద్కర్ నగర్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలను సత్కరించారు. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారిణి డాక్టర్ వినూత్నను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, డీఆర్ఎన్ టాగూర్, ఎ.ప్రసాద్‌కుమార్, సీహెచ్ లూథర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు.

నగర బీజేపీ మహిళా ఆధ్వర్యంలో...

నగర బీజేపీ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి స్వర్ణ రజని ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నగర బీజేపీ జిల్లా ఆఫీసులో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు నిర్మల కిషోర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు పాల్గొన్నారు. వివిధ రంగాల మహిళలను సత్కరించారు.

స్వాతంత్ర సమరయోధుల పార్కులో

ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుల పార్కులో 12 మంది మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించడం ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ మహిళ ఆధ్యాత్మిక వేత్త మంచిరాజు హేమలత మాట్లాడుతూ దేశంలో అనేక మంది మహిళామణులు స్వతంత్ర్య పోరాటంలో జైలు జీవితాలు అనుభవించారని, వారి త్యాగాలకు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలి

రాజమహేంద్రవరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్‌హాల్‌లో కమ్యూనిటీ పారామెడిక్స్-ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో సౌత్ జోన్ డీఎస్పీ ఎస్ భవ్యకిషోర్, మహిళా వైద్యురాలు డాక్టర్ పాసర్ల లక్ష్మీ ప్రసన్నను ఘనంగా సత్కరించారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో కేక్ కట్ చేసి మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ భవ్యకిషోర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించి, వారిని ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా పీఎంపీ సభ్యులను సత్కరించి, వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, సురేష్ బాబు, కోలా లక్ష్మీ నారాయణ, ఎమ్ బాపూజీ హాజరయ్యారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

హుకుంపేటలోని బీజేపీ నాయకులు కరుటూరి శ్రీనివాసరావు నివాసం వద్ద పార్టీ రూరల్ రెండవ మండలం అధ్యక్షుడు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు పాదపూజ చేసి పూలమాలలతో సత్కరించి, వారికి నూతన వస్త్రాలు బహూకరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొల్లివలసి హారిక, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీసంతోషి పాల్గొన్నారు

- రాజమండ్రి నటరాజ్ రైతుబజార్‌లో ఎస్టేట్ అధికారి వెంకటేశ్వరరావు వృద్ధ మహిళలను శాలువాతో ఘనంగా సత్కరించారు. 25 ఏళ్లుగా ఆకుకూరలు అమ్ముతున్న వృద్ధురాలిని సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి ఒక్కరికీ మొదటి గురువు తల్లి

కంబాలచెరువు: ప్రతి ఒక్కరికీ మొదటి గురువు తల్లి అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని, విద్య వల్ల విచక్షణ జ్ఞానం, ఆలోచన ధోరణి పెరుగుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యం కావాలి

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా విభాగం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంఘ జిల్లా అధ్యక్షుడు పి. గిరిప్రసాద్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ ఉద్యోగులకు చేస్తున్న సేవలను సంఘ నగర ఉపాధ్యక్షులు అంజలి శ్రీ వివరించారు. ఏపీజీఈఏ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుందన్నారు. మహిళా విభాగం నాయకులు సీహెచ్‌వీ లక్ష్మి, కొవ్వూరు ఏపీజీఈఏ కార్యదర్శి అమరావతి, మహిళా విభాగం నాయకులు అనిత సమాజంలో మహిళల ప్రాధాన్యతను వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ట్స్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్. చింతా శ్రీదేవి క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పి. గిరిప్రసాద్ వర్మ, నగర అధ్యక్షుడు జీబీ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీ వల్లి, నగర కార్యదర్శి బి. నాగేశ్వరరావు, పట్టణ నాయకులు పాల్గొన్నారు

అవని నుంచి అంతరిక్షం వరకూ మహిళల ప్రగతి

కంబాలచెరువు: అవని నుంచి అంతరిక్షం వరకు మహిళల ప్రగతి సుస్పష్టమని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోటగుమ్మం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ మహిళలను అందరం గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, డీఈఓ కార్యాలయ ఏడీ ఛాయాదేవి, అర్బన్ రేంజ్ ఎంఈఓ-1 రమా రజనితో పాటు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం, అర్బన్ రేంజ్ డీఐ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులను డీఈవో వాసుదేవరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కార్యాలయ ఏడీ వెంకట్ రాజు, అర్బన్ రేంజ్ డీఐ బి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు అన్నింటా ప్రాధాన్యత కల్పించాలి

కడియం: అన్ని రంగాల్లోనూ పురుషులతోపాటు, స్త్రీలకు సమప్రాధాన్యత కల్పించాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడియం మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. రమేష్, సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీపీ వెంకటసత్యప్రసాద్, ఉప సర్పంచ్ రఘురామ్ (నాని) ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, బి సుధ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి జెస్సీప్రియ, ఎంఈవోలు నాగేశ్వరరావు, మణికుమార్ పలు అంశాలపై మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీలకు రక్షణగా పోలీసు వ్యవస్థ ఉందని భరోసానిచ్చారు. సంధాన కర్త గొల్లపల్లి సత్యనారాయణ ఆలపించిన గీతాలు, కవితలు అందర్నీ ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలకు చెందిన సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు.

మహిళా ఎస్సైకు సత్కారం

కడియం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ధనలక్ష్మిప్రసన్న, వుమెన్ పీసీలు నాగదుర్గ, రమణమ్మ, మణికుమారి, ప్రసన్నలను, స్టేషన్‌లో పనిచేసే మంగమ్మను ఇన్‌స్పెక్టర్ ఏ.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రైల్వే స్టేషన్‌లో..

రాజమహేంద్రవరం సిటీ: ఎస్.సీ.రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రధాన రైల్వే స్టేషన్లో శనివారం మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం మేము కార్ షెడ్డులో మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులను సత్కరించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ కమిషనర్, మేము కార్ షెడ్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ డాడీ ప్రసాద్, లోకో పైలెట్ సంధ్య, సీనియర్ టీటీఐ భవానీ, స్టేషన్ మేనేజర్ ఏ.బి.ఎస్ రాగనాథ్ పాల్గొన్నారు.



సత్కార సభలో పాల్గొన్న మెప్మా సీఎంఎంలు, ఆర్పీలు



ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో మహిళా స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు

ఆదిత్యలో కళాశాలలో మహిళలకు సత్కారం

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ జీఎన్‌వీఏబీఎస్ మహాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. శ్రీలత హాస్పిటల్స్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ అనుసూరి ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ పాల్గొన్నారు. స్థానిక ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్ విద్యార్థినులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రమాదేవి, కె.మహేశ్వరి, పోలుకొండ సాయి, మహిళా ఉపన్యాసకులు పాల్గొన్నారు.



డాక్టర్ మహాలక్ష్మిని సత్కరిస్తున్న ఆదిత్య ప్రతినిధులు, విద్యార్థులు

పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లులది అధిక బాధ్యత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులకు సమాన బాధ్యత ఉన్నప్పటికీ తల్లులకు కొంత ఎక్కువ బాధ్యత ఉంటుందని ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీ షిర్డీసాయి విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఏఐఎం పేరుతో మాతృమూర్తులకు నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారికి హాని కలిగించని పద్ధతిలో జీవించాలని చిన్నారులకు తెలపాలని సాయి మాధవ్ అన్నారు. ఈ కార్యక్రమానికీ విచ్చేసిన మరో ముఖ్య అతిథి ప్రముఖ పేరెంట్ ఎడ్యుకేషన్ ట్రైనర్ డాక్టర్ చిట్టి విష్ణుప్రియ మాట్లాడుతు పిల్లలకి కథల ద్వారా మంచి చెడులను వివరించాలన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, సైకాలజిస్ట్, జేసీఐ శిక్షకుడు అభిషేక్ పలు అంశాలు వివరించారు. కేవలం తల్లులకు మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యా సంస్థల యాజమాన్యాన్ని అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.



శ్రీ షిర్డిసాయి సదస్సులో పాల్గొన్న ప్రముఖ రచయిత సాయి మాధవ్, చిట్టి విష్ణుప్రియ, డాక్టర్ విజయలక్ష్మి, అభిషేక్

హౌసీ పత్రాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలి

ప్రకాశం నగర్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు (హౌసీ పత్రాలు) ఇచ్చిన వారికి ఇంటి స్థలాలు చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ డిమాండ్ చేసారు. శనివారం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో పర్యాటించిన పార్టీ నాయకులు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నగరంలో సుమారు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు (హౌసీ పత్రాలు) ఇచ్చి నేటికీ వాటికి సంబంధించిన స్థలం చూపించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్ర మార్చి 17 వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బి పవన్, జిల్లా కమిటీ సభ్యుడు కేఎస్ వి రామచంద్రరావు, బి పూర్ణిమ రాజు పాల్గొన్నారు.

అరుదైన నాణేలను సేకరించిన రాజమహేంద్రవరం వాసి



పెద్దిరెడ్డి శ్రీనివాస్



రూ. 800, రూ.900 నాణేలు

రాజమహేంద్రవరం సిటీ: జైన తీర్థంకరులలో ఒకరైన పార్శ్వనాథ భగవాన్ 2800వ జయంతి, 2900వ వర్ధంతిని పురస్కరించుకొని ముంబై టంకశాల రూ.800.రూ. 900 ముఖ విలువతో ముద్రించిన రెండు వెండి నాణేలను రాజమహేంద్రవరం నగరానికి చెందిన నాణేల సేకరణ కర్త పెద్దిరెడ్డి శ్రీనివాస్ సేకరించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రూ.800, రూ.900 విలువలతో 40 గ్రాముల బరువుతో వెండితో ఈ నాణేలను తయారు చేసారన్నారు. రెండు నాణేలు ఒకేసారి విడుదల కావడం విశేషమని, ఈ స్మారక నాణేలను ప్రత్యేక ఆర్డర్‌పై ముంబయి నుంచి రప్పించినట్లు శనివారం ఆయన తెలిపారు. ఈ నాణేం ఒక్కొక్కటి రూ.6,700 చెల్లించి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శ్వనాథ భగవాన్ 2900 సంవత్సరాల క్రితం వారణాసిని పరిపాలించిన అశ్వసేన మహారాజు, రాణి వామదేవి కుమారుడన్నారు. ఆయన రాజ్య భోగాలన్నింటినీ విడిచిపెట్టి జ్ఞాన సముపార్జన కోసం సన్యాసం స్వీకరించిన మహనీయుడని తెలిపారు. జైనుల ఆరాధ్య దైవమైన భగవాన్ మహావీరుని కంటే 250 సంవత్సరాలు ముందే పార్శ్వనాథ భగవాన్ జన్మించాడని తెలిపారు.

మహిళల కోసం ప్రత్యేకంగా గులాబి మరుగుదొడ్లు

రాజమహేంద్రవరం సిటీ: మహిళలకు సౌకర్యవంతంగా ఉండేలా నగరంలో గులాబి మరుగుదొడ్లు నగరంలో ఏర్పాటు చేస్తున్నామని కమిషనరు కేతన్ గార్గ్ తెలిపారు. శనివారం నగరంలో మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గులాబి మరుగుదొడ్డిని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మరుగుదొడ్డిలో పాలుతాగే పసివారితో వచ్చేవారికి ప్రత్యేకంగా ఒక రూము ఏర్పాటు చేసామని, శానిటరీ నాప్ కిన్ విక్రయించే యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రూ.5 కాయిన్ వేస్తే శానిటరీ నాప్ కిన్ వస్తుందన్నారు. మహిళలు విశ్రాంతి తీసుకోవడానికి కూడా తగిన ఏర్పాటు ఉందని తెలిపారు. వీటిని పూర్తిగా మహిళల కొరకు మాత్రమే నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్‌హెచ్ఓ డా.ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గులాబీ మరుగు దొడ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

బీసీల హక్కుల సాధనకు చలో ఢిల్లీ

రాజమహేంద్రవరం సిటీ: బీసీల హక్కుల సాధన కోసం ఈ నెల 12,13 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పొడుగు(గాడాల)శ్రీను శనివారం రాజమహేంద్రవరంలో పిలుపునిచ్చారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రి వర్గం ఏర్పాటు చేయాలని, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ చేతివృత్తుల విభాగం ఏర్పాటుపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ: చేతి వృత్తి దారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ వేదికగా ఆర్టిసన్ సెల్ (చేతివృత్తుల విభాగం) ఏర్పాటు చేయడం హర్షణీయమని జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడు గుంటముక్కల రాజు పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలు, ఆధునిక యంత్రాల రాకతో చేతి వృత్తులు వారికి పనులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేతి వృత్తుల పనివారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఆర్టిసన్ సెల్ అధ్యక్షుడిగా తోలేటి శ్రీకాంత్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్	: కింగ్‌స్టన్
స్వామి	: శబ్దం
శివజ్యోతి	: మజాకా,చావా
అనుశ్రీ	: మజాకా
రాజా	: అగత్యా
ఊర్వశి	: తండేల్
మేనక	: నారి, పౌరుషం
రంభ	: రాక్షస,రారాజా
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	: సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
అశోక నామవరం	: చావా
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: చావా
మురళీకృష్ణ కడియం	: చావా
వెంకటసూర్య	: చావా